www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -87 ఆదివారం 12 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## పోక్సో కేసు పెట్టారని

# ఆరుగురి దారుణ హత్య

- షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం
- ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో
- అనంతరం గ్రామం నుంచి పరార్
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు
- సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేధం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది.



2లో.

## వియత్నాంలో

# విషాదం

### ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం



2లో.

## మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

### వయోభారంతో మైసూరులో మృతి



**మైసూరు,జులై 11:(ప్రజావినికిడి):**
సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు**మిగతా 2లో...**

# పిల్లలే నిజమైన సంపద





- జనాభా నియంత్రణ కాదు..
- జనాభా సంరక్షణ నినాదం రావాలి
- దక్షిణాదిలో జనాభా తగ్గడం ఆందోళనకరం
- ప్రపంచ జనాభా దినోత్సవంలో చంద్రబాబు

**విజయవాడ,జులై 11: (ప్రజావినికిడి):**
జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి.**మిగతా 2లో...**



## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ





- హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్
- దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే
- దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ
- ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి
- వికసిత్ భారత్- సాంకేతికత పాత్ర అంశంపై అశ్వినీ వైష్ణవ్

**హైదరాబాద్,జులై 11:(ప్రజావినికిడి):**
తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి**మిగతా 2లో...**


## కాళేశ్వరంగేట్లు మూస్తే

# కూలిపోతాయి

- కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక
- పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ
- జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు
- బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్టు వెల్లడి
- గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు

**హైదరాబాద్,జులై 11:(ప్రజావినికిడి):**
కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. **మిగతా 2లో...**





## భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

- ఈ ప్రయాణం ముున్ముందు మరింత విజయవంతమవుతుంది
- ప్రవాస భారతీయలు కృషి ఇందుకు ప్రధాన కారణం
- న్యూజిలాండ్ పర్యటనలో ప్రవాస భారతీయులతో మోడీ

**ఆక్లాండ్,జులై 11:(ప్రజావినికిడి):**
భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం ముున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. **మిగతా 2లో...**

# కాంగ్రెస్ కరువు

## కాలం తెచ్చిన కరువు కాదు...

- గోదావరిలో నీళ్లు ఉన్నా ఉపయోగించుకోని దరిద్రం
- కావాలనే నీటిని వృధాగా వదులుతున్నారు
- మీడియా సమావేశంలో మరోమారు కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,జులై 11:(ప్రజావినికిడి):**
ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళ్లు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు.
రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి**మిగతా 2లో...**



# కాళేశ్వరంగేట్లు మూస్తే కూలిపోతాయి

**మొదటిపేజీ తరువాయి**

శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్‌ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్టు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్‌ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పిల్లలే నిజమైన సంపద

**మొదటిపేజీ తరువాయి**

ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతిపెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలని సూచించారు. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుందఅని చంద్రబాబు అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం 2026 చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వైద్యులు, వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా అత్యధిక ఆదాయం సంపాదించేవారు తెలుగువారేనని తెలిపారు. ఆరోజు ఐటీ గురించి మాట్లాడానని.. ఈరోజు ఏఐ గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఆనాడు తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలంటే చాలా ఆలోచన చేసే వారని పేర్కొన్నారు. ఆనాడు త్వరగా పెళ్లిళ్లు చేసి అత్తగారింటికి పంపిస్తే బాధ్యత అయిపోతుందని అనుకునేవారని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పుడు మగపిల్లలకు పోటీగా ఆడపిల్లలు ఎదగాలని బాగా చదివించాలని చెప్పానని గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. అప్పుడు వరకట్నం ఉండేదని.. ఇప్పుడు ఎదురు కట్నం వచ్చిందని ప్రస్తావించారు. ఆడపిల్లలే ఎదురు కట్నం తీసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నేడు భర్తల కన్నా భార్యల ఆదాయం ఎక్కువగా ఉందని వివరించారు. తనకన్న తన సతీమణి ఆదాయం, తన కొడుకు కంటే.. తన కోడలు ఆదాయమే ఇప్పుడు ఎక్కువుగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పోక్సో కేసు పెట్టారని ఆరుగురి దారుణ హత్య

**షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం**

**ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో**





**రంగారెడ్డి,జులై 11:(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు.


# వియత్నాంలో ఘోర ప్రమాదం..

## ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

**వియత్నాం జులై 11: (ప్రజావినికిడి):**
వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.

ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉద్ధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది.

స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి



విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది.

ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది.

బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (+84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, +84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

**మొదటిపేజీ తరువాయి**

అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు.ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

# కాంగ్రెస్‌కరువు

**మొదటిపేజీ తరువాయి**

అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళ్లు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు.

గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళ్లు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు

చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు.

-------

# భారత్-న్యూజిలాండ్ బంధం మరింత బలోపేతం

**మొదటిపేజీ తరువాయి**

అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

------------

# నష్ట పరిహారం చెల్లించాకే మూసీ పనులు మొదలు పెట్టాలి

## ఎంపీ ఈటీల రాజేందర్




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** రాష్ట్రీయ లోక్ దళ్ తెలంగాణ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ లోని ఓ హోటల్ లో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,ఎంపీ ఈటెల రాజేందర్, ప్రొఫెసర్ హరగోపాల్ తోపాటు పలువురు పర్యావరణ వేత్తలు హాజరయ్యారు. మూసీని ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అలాగే బాధితులకు నష్ట పరిహారం చెల్లించిన తరువాతనే మూసీ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.ఎఫ్టీఎల్, బఫర్ జోన్ బాధితులకు దూరంగా డబుల్ బెడ్ రూమ్స్ కేటాయించడం వల్ల వారికి ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.మూసీ బాధితులకు అక్కడే ఇండ్లు కట్టించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నదిలో పారిశ్రామిక వ్యర్థాలను కలుషితం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ పాలకుల హడావిడి కనిపిస్తుంది తప్ప ఆచరణలో సాధ్యం కాని విధంగా ఉందని కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. బాధితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించిన తర్వాతనే ఈ ప్రాజెక్టు మొదలుపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో డాక్యుమెంటేషన్ చేస్తామని పర్యావరణ వేత్తలు,ఆల్ పార్టీ నేతల అభిప్రాయాలు రికార్డు చేసి దత్తాత్రేయ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కులుస్తామని దిలీప్ కుమార్ తెలిపారు.ఈ సమావేశంలో ట్రైకార్ మాజీ చైర్మన్ బెల్లయ్య నాయక్,ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి, మన్నారం నాగరాజు,కర్నాటి మనోహర్,మాజీ ఎమ్మెల్యే వర్థాల శ్రీరాములు,మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి (ఉపాధ్యక్షులు, టీఆర్ఎల్డీ),బీరప్ప (ప్రవక్త),విశాల్ (ప్రధాన కార్యదర్శి), ఓంకార్ (కార్యదర్శి), నరసింహారావు (ప్రధాన కార్యదర్శి),రిషభ్ జైన్ (ప్రధాన కార్యదర్శి),గిరి కుందే (కోశాధికారి), బుల్లెట్ వెంకన్న, రాజ్కుమార్ (రాష్ట్ర యువజన అధ్యక్షులు), జనగాం జిల్లా అధ్యక్షులు సుధాకర్ రెడ్డి తదితర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ, మాతా మహంకాళి బోనాల ఉత్సవాలపై పోలీసుల పర్యవేక్షణ..



**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ, మహంకాళి దేవాలయ 104 వ బోనాల ఉత్సవాల సందర్భంగా అంబారిపై అమ్మవారి ఘటం ఊరేగింపు పై పోలీసు ఉన్నత అధికారులు డిసిపీ రాఘవేంద్ర రెడ్డి, అడిషనల్ డిసిపి కృష్ణగౌడ్,ఏసీబీ తిరుపతి,సీఐ రాములు కుల్చంపుర, టప్పాచబుత్ర సిఐ బాలకృష్ణ లు బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లపై పర్యవేక్షణ చేశారు. బోనాల ఉత్సవాలు విజయవంతం చేయడానికి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పూజా కమిటీ అధ్యక్షులు కట్ట లింగం,ప్రధాన కార్యదర్శి అల్లే రామ్ కుమార్, సలహాదారులు గుడబోయిన శివరత్నం, సేనాపతి చంద్రశేఖర్,కట్ట నర్సింగ్ రావు, గుడుమని అశోక్ కుమార్,గాండ్ల నిరంజన్ బాబు పాల్గొన్నారు.


# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతోనే అన్ని మండలాల అభివృద్ధి

**చేగూర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం**

**రెవెన్యూ నిధుల సాధనలో ఎమ్మెల్యే మార్క్..**

**షాద్‌నగర్‌కు రూ.100 కోట్లకు పైగా**

**హెచ్ఎండీఏ నిధులు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే షాద్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని నందిగామ మండలం చేగూర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం ఒక ప్రకటనలో కొనియాడారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలోని రోడ్లు,ప్రభుత్వ భవనాల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై ధ్వజం**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసమే కొత్త మండలాలను ఏర్పాటు చేసిందే తప్ప,వాటికి కావాల్సిన మౌలిక వసతులను, ప్రభుత్వ కార్యాలయాలను పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు.అధికారులు కూర్చోవడానికి సరైన భవనాలు లేక,ప్రజలు పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడితే గత పాలకులు పట్టించుకోలేదని మండిపడ్డారు.

**మారబోతున్న నందిగామ ముఖచిత్రం:**

మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని,ముఖ్యమంత్రి సహకారంతో (హెచ్ఎండీఏ) నుండి రూ. 100 కోట్లకు పైగా నిధులను నియోజకవర్గానికి తీసుకురావడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**ఈ విడతలో మంజూరైన ప్రధాన నిధుల వివరాలు**

నర్సప్పగూడ-నందిగామ డబుల్ రోడ్డుకు:రూ. 7.30 కోట్లు,నందిగామ తహసీల్దార్ కార్యాలయ నూతన భవనానికి: రూ. 2.20 కోట్లు,త్వరలోనే ఈ పనులన్నీ ప్రారంభం కానున్నాయని, రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేనాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని చేగూర్ సర్పంచ్ మంకాల శ్రీశైలం ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా టీఎన్జీవోస్ నేత ముజీబ్ జన్మదిన వేడుకలు



**నాంపల్లి,(ప్రజా వినికిడి):** టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ జన్మదినాన్ని పురస్కరించుకుని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో, కార్యదర్శి ఎం. భాస్కర్ సమన్వయంతో పలు సేవా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో పేద, అవసరమైన వారికి టిఫిన్ పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ మోడల్ ఆలియా పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం (డీఈఓ కార్యాలయం)లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఉపాధ్యక్షుడు ఏ. రుగేష్, ప్రజా కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్,ఈసీ సభ్యులు ముజాహిద్ అలీ, ప్రియదేవ్ ఠాకూర్, మొయినుద్దీన్, ఫోరం సంయుక్త కార్యదర్శి రమేష్, సుదర్శన్, సంస్థాగత కార్యదర్శి శ్రీనివాస్,శేఖర్, ప్రచార కార్యదర్శి శివ,అరుణ జ్యోతి,అఖిల్, ఈసీ సభ్యుడు ఎం.యోగేందర్, ప్రాథమిక సభ్యులు, టీఎన్జీవోస్ సభ్యులు పాల్గొని డా.హుస్సైనీ ముజీబ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


# చారిత్రక ఫిరంగి నాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత..

**శంషాబాద్, సాతం రాయి గ్రామాలలో ఫిరంగినాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..**

**నాలా ప్రవాహానికి అడ్డుగా ఏకంగా ప్రహరీ గోడ నిర్మాణం..**







**శంషాబాద్,(ప్రజావినికిడి):** నిజాం కాలం నాటి చారిత్రక 'ఫిరంగి నాలా'రంగారెడ్డి జిల్లాలో తీవ్ర కబ్జాలకు గురవుతోంది. షాబాద్ మండలం చందన్‌వెల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు దాదాపు 85 కిలోమీటర్ల పొడవున ప్రవహించే ఈ కాలువను,రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు, ప్రహరీలు నిర్మిస్తున్నారు.

శంషాబాద్ మండలంలోని శాతంరాయి, శంషాబాద్ లోని సదరన్ మెగా టౌన్ షిప్ వెంచర్ పరిధిలో ఫిరంగినాలను స్థానికులతో కలిసి పరిశీలించిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు.. ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ, గతంలో హైదరాబాద్ నగరంపై వరద ప్రభావం తగ్గడానికి నిర్మించిన ఫిరంగి నాల షాబాద్ మండలంలో చందనవెల్లి గ్రామంలో మొదలుకొని ఇటు పక్క ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు 84 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా నీరు అందించే ఫిరంగి నాల కాలువపై నేడు అభివృద్ధి పేరిట భూ బకాసురుల కబంధహస్తాల్లో కనుమరుగుతున్న వైనం పట్ల విచారం వ్యక్తం చేశారు. సాతంరాయి గ్రామంలో ఫిరంగినాలను పూడ్చి వేసి ఇటు అపర్ణ కన్స్ట్రేషన్ మరోపక్క వసుంధర కన్స్ట్రక్షన్స్,బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.నేడు ప్రకృతి వనరులపై రియల్ ఎస్టేట్,అభివృద్ధి పేరిట కనుమరుగవుతున్న ఫిరంగినాలపై ఇటు రెవెన్యూ శాఖ,ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఎవరైతే ఆక్రమణలకు పాల్పడ్డారో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఫిరంగి నాలను పరిరక్షించి భవిష్యత్తు తరాలకు నీరు అందే విధంగా చూడాలని నాలాలో ఎలాంటి మురుగునీరు చేరకుండా పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# ఈ నెల 13న రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలి

**- నియోజకవర్గ అధ్యక్షుడు అలమనేటి గోపాల్**



**శంషాబాద్,(ప్రజావినికిడి):** జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ పిలుపు మేరకు,ఈ నెల 13న రంగారెడ్డి కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ అధ్యక్షుడు అలమనేటి గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# చైతన్యపురి లో (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియపై బిఆర్ఎస్ అవగాహన కార్యక్రమం



**చైతన్యపురి, జూలై,11,(ప్రజా వినికిడి):** చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఓటర్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియపై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైతన్యపురి బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,ఆధ్వర్యంలో భవాని నగర్ ద్వారకపురం, విద్యుత్ నగర్, కాలనీవాసుల కోసం ఎస్ఐఆర్ నమోదు పారాలను అందజేసి ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి అర్హత ఓటర్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ త్రివేది, యువకులు సాయి,ప్రశాంత్, రామకృష్ణ, జలంధర్ పులి కిరణ్,శ్రావణ్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



# దైవాల గూడ ఆరుగురి హత్య కేసులో కీలక చర్య

**సీఐ క్రాంతి రెడ్డి,ఎస్సై రమేష్ లు సస్పెన్షన్ పోక్సో కేసులో నిర్లక్ష్యంపై విమర్శలు**

**ప్రాథమిక విచారణ తర్వాత ఫ్యూచర్ సిటీ సిపి ఆదేశాలు**



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):** జిల్లాలోని షాబాద్ మండలం దైవాల గూడలో సంచలనం సృష్టించిన ఆరుగురి హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు.విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ సీఐ క్రాంతి రెడ్డి,ఎస్సై రమేష్ లను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) తరుణ్ జోషి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.నిందితుడు రాజ్‌కుమార్‌పై గతంలోనే ఒక మైనర్ బాలిక ఫిర్యాదు చేయగా,పోలీసులు కేసు నమోదు చేసినప్పటికీ అతనిపై తగిన చర్యలు తీసుకోకపోవడమే ఈ ఘోరానికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.బాధిత మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గతంలోనే రాజ్‌కుమార్‌పై పోక్సో (పోక్సో) చట్టం కింద కేసు నమోదు చేశారు.అయితే కేసు నమోదైనప్పటికీ నిందితుడిని సకాలంలో అరెస్టు చేయకపోవడాన్ని బాలిక కుటుంబ సభ్యులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. నిందితుడు రాజ్‌కుమార్‌కు షాబాద్ సిఐ క్రాంతి రెడ్డితో పాటు స్థానిక ఇన్స్పెక్టర్ కూడా లోపాయికారీగాసహకరించారని,పోలీసుల అండదండలు ఉండటం వల్లే అతను ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టాడని బాధిత కుటుంబ సభ్యులు బహిరంగంగాఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో పోలీసుల వైఫల్యంపై తీవ్ర విమర్శలు రావడంతో రంగంలోకి దిగిన సీపీ,ప్రాథమిక విచారణ అనంతరం సిఐ క్రాంతి రెడ్డి, ఎస్సై రమేష్ లను సస్పెండ్ చేశారు.ఇదిలా ఉంటే.ఈ ఘటనలో పోలీసుల కీలక ప్రకటన చేశారు.నిందితుడు రాజ్‌కుమార్‌ను పట్టిస్తే రూ.2లక్షల రివార్డు ఇస్తామని వెల్లడించారు.నిందితుడు రాజ్‌కుమార్ కోసం 10 బృందాలతో పోలీసుల గాలింపు చర్యలు చేపట్టారు.

## భారతీయ సంస్కృతిని విశ్వ వ్యాప్తంగా చేస్తున్నారు

### సీనియర్ జర్నలిస్ట్ శంకర్ నారాయణ




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** కళాకారులు భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక తత్వాన్ని విశ్వ వ్యాప్తంగా చేస్తున్నారని హాస్య బ్రహ్మ సీనియర్ జర్నలిస్టు శంకర్ నారాయణ అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో రమ్యా నాయుడు ఆధ్వర్యంలో శ్రీ రాగ రమ్య సంస్థ నిర్వహించిన సంగీత నృత్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల నుండి 160 మంది చిన్నారులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హాస్యబ్రహ్మ శంకరనారాయణ మాట్లాడుతూ, కళాకారులు చేసే ప్రదర్శనల ద్వారానే దేశభక్తి పెంపొందించి ప్రపంచంలోనే ప్రఖ్యాత పేరును రాణిస్తున్నామని కొనియాడారు. కళాకారులు భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక తత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు. శ్రీ రాగ రమ్య సంస్థ గత 8 సంవత్సరాలలో 400 కార్యక్రమాలు అద్భుతంగా నిర్వహించారని అందులో 150 ఆధ్యాత్మిక కళా కార్యక్రమాలను ప్రముఖ పుణ్య క్షేత్రాలైన తిరుపతి, కాణిపాకం,శ్రీశైలం, కాళహస్తి,స్వర్ణగిరి దేవాలయాల్లో నిర్వహించడం ఎంతో అద్భుతమన్నారు. రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు,ఎక్స్ లెన్సీ బుక్ ఆఫ్ రికార్డ్స్ నేషనల్ కో ఆర్డినేటర్ కదిరి వెంకట రమణా రావు మాట్లాడుతూ, తాను శ్రీ రాగ రమ్య సంస్థ స్థాపించినప్పటి నుంచి ఎన్నో కార్యక్రమాలలో పాల్గొన్నానని,కళా కారుల ప్రతిభను గుర్తించి వారిని సత్కరించడం జరిగిందని అన్నారు.శ్రీ రాగ రమ్య సంస్థ చక్కటి అభిరుచిగల కార్యక్రమాలు నిర్వహిస్తుందని సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. నరసింహులు శిష్యరికంలో నెమలికి నేర్పిన నడకలివే భరతనాట్య ప్రదర్శన అందరిని మంత్ర ముగ్ధులను చేసింది.సంగీత నృత్య గురువులు శిరీషా దేవి, సుప్రజ,నాగ జ్యోతి లలితా కామేశ్వరి,కవిత రాజ్యలక్ష్మి, నరసింహులు అనిత,రాధికా అశోక్,మేఘన ప్రణవి,ఉమాశ్రీ, గురు శరవణ, చందులు అతిథులుగా పాల్గొనడమే కాకుండా తమ శిష్యబృందాల చేత అందరినీ ఆకట్టుకునే ప్రదర్శనలు చేయడం విశేషంగా ఆకట్టుకున్నదని శ్రీ రాగ రమ్య వ్యవస్థాపకురాలు రమ్యానాయుడు అన్నారు.

## మసీదు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ.. బొడ్రాయి కమిటీ సభ్యులు తీర్మానం..





**శంషాబాద్,(ప్రజావినికిడి):** జూలై 11, శంషాబాద్ కేంద్రలోని, ప్రకాశ్‌నగర్ కాలనీలో కొత్తగా ఒక మసీదు నిర్మాణం స్థానికంగా వివాదానికి దారితీసింది. బొడ్రాయి కమిటీ పెద్దలు మాట్లాడుతూ,ఈ నిర్మాణ స్థలం స్థానిక పోతురాజు ఆలయానికి పక్కనే ఆనుకుని ఉండటంతో మతపరమైన మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలో మత సామరస్యానికి భంగం కలగకుండా ఉండాలంటే ఇరు వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం రావాలని కోరారు. సదరు భూ యజమాని ఇఫ్తేకార్ షరీఫ్‌ను కలిసి తమ అభ్యంతరాలను, శాంతిభద్రతల సమస్యలను వివరించినట్లు తెలిపారు. అయితే,ఆయన మాత్రం భవన నిర్మాణాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం వెంటనే జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో నిర్మాణ చట్టబద్ధతను పరిశీలించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఒకవేళ స్థానిక అధికారులు స్పందించని పక్షంలో తాము నేరుగా ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా లిఖితపూర్వక ఫిర్యాదు అందజేస్తామన్నారు. అంతేకాకుండా, న్యాయం జరిగే వరకు ప్రభుత్వ కార్యాలయాల ముట్టడితో పాటు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ బస్తీ సమావేశంలో నర్ర పాండు,నర్ర యాదగిరి,నర్ర గిరి,నర్ర శ్రీనివాస్, నర్ర రామారావు, నర్ర బాబు, మక్కల విజయ్, ఎం.చంద్రశేఖర్, ఎం.మహేష్,ఎం. ప్రేమ్‌కుమార్,ఎం. రజనీకాంత్,వి. సందీప్,ఎం. రాజు,జెలేందర్, ఎం.శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌తో ఎమిరేట్స్ ప్రతినిధుల భేటీ

### విమాన సర్వీసులను పెంచాలని కోరిన సిఎం




**హైదరాబాద్,జులై 11(ప్రజావినికిడి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమిరైట్స్ వైమానిక సంస్థ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎంతో చర్చించారు. ఎమిరైట్స్ వైమానిక సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎంను మర్యాదపూర్వకంగా ఎమిరైట్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కలిశారు. హైదరాబాద్‌లో ఎమిరైట్స్‌ఎ-38 సర్వీసులను ప్రారంభించేందుకు ఈ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సుముఖత వ్యక్తం చేశారు. ఎమిరైట్స్ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో మరో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో అక్కడ కూడా ఎమిరైట్స్ ఆపరేషన్స్ కొనసాగించాలని సీఎం సూచించారు. విమాన సర్వీసులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్శిటీలో క్రీడాకారులకు శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్‌నకు ముందుకు రావాలని సీఎం కోరారు. ఈ విషయంపై ఎమిరైట్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు.

## లాల్‌పహాడ్ చౌరస్తా నుండి చౌదరిగూడెం వరకు

# డబుల్ రోడ్డుకు రూ.7.50 కోట్ల మంజూరు

### ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్





**షాద్ నగర్ (ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని లాల్‌పహాడ్ చౌరస్తా నుండి, చౌదరిగూడెం వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల చౌదరిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ,
ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేక దృష్టి సారించడం సంతోషకరమన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు,రైతులకు,విద్యార్థులకు, వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడంలో ఈ రోడ్డు కీలకంగా నిలుస్తుందని చెప్పారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి,సంబంధిత అధికారులకు, ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మండల కాంగ్రెస్ పార్టీ తరఫున కృతజ్ఞతలు. తెలియజేస్తున్నామని చంద్రశేఖర్ పేర్కొన్నారు. పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ గ్రంథాలయ నిర్మాణ గోడను

# కాలితో కూల్చిన బూర్గుల సర్పంచ్

**నిర్మాణ నాణ్యత పేరుతో స్వయంగా గోడ ధ్వంసం..**

**వీడియో సోషల్ మీడియాలో వైరల్**

**ప్రభుత్వ ఆస్తి ధ్వంసంపై అధికారుల చర్యల కోసం స్థానికుల డిమాండ్**








**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనం గోడను గ్రామ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి స్వయంగా కాలితో తన్ని కూల్చివేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాచారం ప్రకారం,నిర్మాణ పనులను పరిశీలించేందుకు వెళ్లిన సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి నిర్మాణ నాణ్యత సరిగా లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఉన్న ఇంజినీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పట్టించుకోకుండా నిర్మాణంలో ఉన్న గోడను కాలితో తన్ని కూల్చివేసినట్లు సమాచారం. ఈ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారింది. ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న భవనాన్ని పరిరక్షించాల్సిన ప్రజాప్రతినిధే స్వయంగా గోడను ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.
నిర్మాణ నాణ్యతపై సందేహాలు ఉంటే సంబంధిత శాఖ అధికారులు,ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి సాంకేతిక పరిశీలన చేయించాల్సి ఉండగా, స్వయంగా గోడను కూల్చివేయడం చట్టబద్ధమేనా అనే చర్చ జరుగుతోంది.
ప్రభుత్వ ఆస్తి ధ్వంసానికి సంబంధించిన ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించి విచారణ చేపట్టి,వాస్తవాలను వెలికితీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## చించోడు గ్రామంలో ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ నిర్వహణ

### కుటుంబ సంక్షేమం ఆరోగ్య కేంద్రాల లక్ష్యం - హెల్త్ ఎడ్యుకేటర్,జె. శ్రీనివాసులు





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫారుక్ నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆదేశానుసారం హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ చించోడు గ్రామంలో నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్.ఎల్.హెచ్.పి.వైద్య అధికారి డాక్టర్ ముస్తకిన్ అహ్మద్ జండా ఊపి ప్రారంభించారు.తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు ప్రపంచ జనాభా దినోత్సవం స్లోగన్స్ చెపుతూ ర్యాలీని నిర్వహించారు.

1) ఆరోగ్యంగా జీవించు-ఆదాయాన్ని పెంచు.
2).కాన్పుల మధ్య దూరం-తల్లి బిడ్డలకు శ్రేయస్కరం.
3).కుటుంబం చిన్నదైతే-
ఆనందం సాధ్యమైతది,4). అధిక జనాభా- అభివృద్ధికి ఆటంకం,5).చిన్న కుటుంబం,చింతలేని కుటుంబం. 6).కుటుంబ సంక్షేమం-ఆరోగ్య కేంద్రాల లక్ష్యం. 7).కుటుంబ నియంత్రణతో-జనాభా స్థిరీకరణ. 8).జనాభా పెరుగుతుంది-వనరులు తరుగుతున్నాయి.

ర్యాలీ అనంతరం చించోడు గ్రామం చౌరస్తాలో హెల్త్ ఎడ్యుకేటెర్ జె.శ్రీనివాసులుమాట్లాడుతూ,
ప్రపంచ జనాభా దినోత్సవం ప్రతి సంవత్సరం జూలై 11న నిర్వహిస్తామని,
ఈ జనాభా దినోత్సవాన్ని మొట్టమొదటగా 1989లో యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం వారు ప్రారంభించారు అని,ప్రపంచ జనాభా వేగంగా పెరగడం వల్ల ఏర్పడే సామాజిక,ఆర్థిక,ఆరోగ్య మరియు పర్యావరణ సమస్యలపై ప్రజలలో అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని జె.శ్రీనివాసులు చెప్పారు. ఈ ప్రపంచ జనాభా దినోత్సవం రోజు ప్రజలకు జనాభా పెరుగుదల వల్ల కలిగే ప్రభావాలపై అవగాహన కల్పించాలని,కుటుంబ నియంత్రణ సేవలను ప్రోత్సహించాలని,తల్లి శిశు ఆరోగ్యాన్ని మెరుగు పరచడం మన బాధ్యత అని,మహిళా సాధికారత మరియు బాలికల విద్యను ప్రోత్సహించాలని, ప్రజలలో లింగ సమానత్వం గురించి తెలియజేయాలని, ప్రజలకు ఆరోగ్యం పై అవగాహన కల్పించాలని జె.శ్రీనివాసులు తెలియజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం రోజు మనము ఇలాంటి ర్యాలీలు తీయడం వలన ప్రజలలో ఆరోగ్యకరమైన కుటుంబాల నిర్మాణానికి తోడ్పడుతుంది అని,మాతృ మరణాలు శిశు మరణాలు తగ్గించడం లో సహాయపడుతుందని,వనరుల సమర్ధ వినియోగము మరియు స్థిరమైన అభివృద్ధికి తోడ్పడుతుందని,యువతలో బాధ్యతాయుతమైన ఆరోగ్య అవగాహన పెంచుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చించోడు ఎం ఎల్ హెచ్ పి వైద్య అధికారులు డాక్టర్ ముస్తకిన్ అహ్మద్,డాక్టర్ కార్తీక్,డాక్టర్ జగదీశ్వర్,డాక్టర్సత్యనారాయణ,డాక్టర్ దినేష్,డాక్టర్ సంధ్య,డాక్టర్ ప్రవీణ,హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు,హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ,ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు మరియు ఆశాలు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# 40 సంవత్సరాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక..








**ఒంగోలు,(ప్రజావినికిడి):**
నలభై ఏళ్ల కాలం గడిచినా,స్నేహపు సువాసన చెక్కు చెదరలేదుగురువుల కలలతో మొదలైన ఆ ప్రయాణం, జ్ఞాపకాల వెలుగులో నేడు మళ్లీ కలిసిందిమారింది కాలమే కానీ,మారని మనసులు మళ్లీ ఒకే వేదికపై చిరునవ్వులు చిందించాయి. నలభై ఏళ్ల క్రితం తమకు,శిక్షణ ఇచ్చిన గురువుల్లో,నేటికీ జీవించి ఉన్న, సైకాలజీ లెక్చరర్ ను చూసి, ఉద్వేగానికి లోనైన దృశ్యాలు...నాటి రూమ్ మేట్స్, బ్యాచ్ మేట్స్ ఒక్క చోట చేరి, పరస్పరం గుర్తు చేసుకునే సందర్భాలు,నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్న క్షణాల్లో,చెమర్చిన వారి కళ్ళు... ఇలాంటి అపురూప దృశ్యాలు రోజు సాక్షాత్కరించాయి.

40 సంవత్సరాల తర్వాత,ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసుకోవడం బహుశా ఇది ప్రప్రథమే కావచ్చు.
మిత్రుల ఈ మహా కలయిక,జీవిత పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మధుర కావ్యమే అవుతుంది.
ఇక అసలు విషయానికి వస్తే....
1985 - 86 విద్యా సంవత్సరంల, ప్రకాశం జిల్లా, మైనంపాడు నందు,టీచర్ ట్రైనింగ్ చేసిన అప్పటి ఉపాధ్యాయులు, కేవలం కొద్ది మంది మాత్రమే ఇంకనూ సర్వీస్ లో ఉండగా,నేడు రిటైర్ స్టేజ్లో, తాతలు, అమ్మమ్మలుగా, 40 సంవత్సరాల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఈరోజు తడిసి ముద్దయిన దృశ్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.అప్పటి డిస్టిక్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ నందు మొట్టమొదటి ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా ఎంపికైన 150 మంది శిక్షణార్థులు, మైనంపాడు నందు శిక్షణ పొందారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ఓ చిన్న వాట్సప్ గ్రూపును తయారు చేసుకుని ఒక్కొక్కరిగా 90 మంది వరకు ఆ సమూహంలో చేరారు.ప్రస్తుతం 70 మంది అప్పటి శిక్షణార్థులు,నేడు ఒంగోలు పట్టణంలోని టీటీడీ కళ్యాణమండపం నందు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా అప్పటి సైకాలజీ లెక్చరర్ డివి




ఆంజనేయులు మాట్లాడుతూ, రాము నేర్పిన క్రమశిక్షణను ప్రస్తుత ఉపాధ్యాయులు కార రూపంలో పెడుతూ వారి తల్లిదండ్రులను అనాధాశ్రమంలో కాకుండా వారి పట్ల శ్రద్ధ సక్తులు కనబరుస్తూ సేవ చేయాలని కోరారు.ఒకరికి సాయం చేయకపోయినా అన్యాయం మాత్రం చేయకండి అంటూ ఉద్భోదించారు.
మధ్యాహ్నం మధ్యాహ్నం వీరంతా,తాము చదివిన మైనంపాడు వెళ్లి, అక్కడ తాము చదివిన తరగతి గదులను, పరిసరాలను పరిశీలించి ఉద్వేగానికి లోనయ్యారు.ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించడంలో, లయన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ ప్రధాన భూమికను పోషించగా, వారికి ఉమా జిలాని తదితరులు సహకరించారు.

# చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తక్షణమే కల్పించాలి

## నేదునూరి జ్యోతి -భారత జాతీయ మహిళా సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి





**రంగారెడ్డి, (ప్రజావినికిడి): జులై 11,**
దేశ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో కనీసం 33 శాతం రిజర్వేషన్ తక్షణమే కల్పించాలని భారత జాతీయ మహిళా సమఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈరోజు ఉదయం 11:30 గంటలకు అరుణ,నీలమ్మ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐ డబ్బులు 5వ మహాసభ సిపిఐ రాజేంద్రనగర్ కార్యాలయం ఏ ఆర్ దేవరాజ్ భవన్ లో జరిగినది ముఖ్యఅతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నారీ శక్తి వందన్ అభియాన్ పేరుతో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించినప్పటికీ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో 2029 సంవత్సరానికి వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ తక్షణమే అమలు చేయాలని మోడీ సంకీర్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినది స్త్రీలపై జరుగుతున్న అన్ని రకాల దోపిడీ వివక్షత పీడనలకు కారణం ఫాసిస్టు సామ్రాజ్యవాద పితృస్వామ్య వ్యవస్థ కారణమని తెలిపారు ఆధిపత్య దోపిడీ పాలకవర్గాలను కూల్చడంతోనే మహిళల యొక్క విముక్తి ముడిపడి ఉందని పేర్కొన్నారు. ఆధునిక సమాజంలో కూడా స్త్రీలపై అత్యాచారాలు అపహరణలు వరకట్న వేధింపులు హత్యలు నిత్య కృత్యమైనాయని ఆవేదన వెలిపించారు సాంఘిక ఆర్థిక రాజకీయ సమానత్వం సమాజంలో మహిళలకు అందినప్పుడే మహిళా సాధికారిక సాధ్యం అవుతుందని తెలిపారు బలమైన మహిళా సమఖ్య నిర్మాణం కొరకు గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహిస్తూ జిల్లా మహాసభలను పూర్తి చేసుకుంటూ రాష్ట్ర మహాసభకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఫైమీద,కె.లక్ష్మి, అనురాధ,విజయ కమల,మంజుల శ్రీదేవి సుజాత యాదమ్మ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
నూతన కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది,
గౌరవ అధ్యక్షురాలిగా పి.నీలమ్మ,అధ్యక్షురాలిగా వడ్ల మంజుల,వర్కింగ్ ప్రెసిడెంట్ గా కన్యగారి లక్ష్మిఉపాధ్యక్షురాలిగా బి.యాదమ్మ, వరలక్ష్మి,ప్రధాన కార్యదర్శి గా కె.శ్రీదేవిసహాయ కార్యదర్శులుగా రోజా,సుజాత కోశాధికారి గా అలివేలు ను ఎన్నుకోవడం జరిగింది.

# జాతీయ మేధావుల వేదికలో పాల్గొన్న ఈసీజీ ఫౌండేషన్ ప్రతినిధులు

## ప్రముఖులకు మొక్కలు అందజేసి పర్యావరణ పరిరక్షణ సందేశం






**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు మనోవిజ్ఞాన నిపుణులు, విద్యావేత్తలు సామాజిక సేవకులతో కూడిన ఈసీజీ ఫౌండేషన్ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో నిర్వహించిన ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ మేధావుల సమావేశంలో ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొన్నారు.
"ప్రజాస్వామ్యం దౌత్యం అభివృద్ధి" అంశంపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పీ.నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈఎఫ్ఎల్యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్. నాగరాజు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అనురాధ జొన్నలగడ్డ మేధోపరమైన ప్రసంగాలతో సభను ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా ఈసీజీ ఫౌండేషన్ సభ్యులు కేంద్ర మంత్రులు, ఉపకులపతులు, విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రముఖులతో పరస్పర చర్చలు జరిపి పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం, విద్య, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.ఈసీజీ ఫౌండేషన్ ప్రతినిధి బృందంలోపద్మశ్రీ ప్రొఫెసర్ డా.పి. హనుమంతరావుప్రొఫెసర్ డా. మార్కండేయులు పర్యావరణ శాస్త్రవేత్తప్రొఫెసర్ డా. తులసి రావు, ఐఎఫ్ఎస్ మాజీ బయోడైవర్సిటీ డైరెక్టర్ డా.నోముల వెంకటేశ్వర్లు సీనియర్ సైకాలజిస్టుశ్రీ శాంతన్ కుమార్ మాజీ డైరెక్టర్, ఇస్రోప్రొఫెసర్ డా. కె.ఎల్. నారాయణరావు సీనియర్ కౌన్సెలర్ & సైకోథెరపిస్టు ప్రొఫెసర్ డా. రామస్వామి రచయిత, కవిప్రొఫెసర్ నరసింహ దాస్ ఉద్యానవన శాస్త్రవేత్త
ప్రొఫెసర్ డా. కొడాటి విజయలక్ష్మి సీనియర్ గైనకాలజిస్టు & జన్యు వ్యాధుల నిపుణురాల
ప్రొఫెసర్ డా.ధనశ్రీ సీనియర్ గైనకాలజిస్టు & ఫిజియాలజిస్టుడా.శృతి ఇన్‌ఫర్టిలిటీ స్పెషలిస్టు
డా.జ్యోత్స్న సీనియర్ శిశు వైద్య నిపుణురాలు
డా. రాజు ఫేషియో మ్యాక్సిలరీ సర్జన్ డా. రామోహన్ వెల్‌నెస్ కోచ్‌తదితర ప్రముఖులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఈసీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభకు విచ్చేసిన ప్రముఖులు, అతిథులు, మేధావులకు పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా మొక్కలను అందజేశారు.ఈ వినూత్న కార్యక్రమాన్ని కేంద్ర మంత్రులు, ఉపకులపతులు, విద్యావేత్తలు పలువురు ప్రముఖులు అభినందిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ఈసీజీ ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ఈసీజీ ఫౌండేషన్ భవిష్యత్తులో కూడా రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ,మొక్కల నాటకం,జీవ వైవిధ్య సంరక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు.

# హెలికాప్టర్ ఆపితే.. రైల్లో వస్తారు

## : జగన్ భీమవరం పర్యటనపై పేర్ని నాని



**అమరావతి, జులై 11 (ప్రజావినికిడి):**
ఆక్వా రైతుల సమస్యలపై వైసీపీ అధినేత జగన్ చేపట్టబోయే భీమవరం పర్యటనను కూటమి ప్రభుత్వం ఏ రకంగానూ అడ్డుకోలేదని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఒకవేళ హెలిప్యాడ్‌కు పర్మిషన్ ఇవ్వకపోతే.. జగన్ రైలు ఎక్కైనా సరే భీమవరం వచ్చి రైతులను కలుస్తారని తేల్చిచెప్పారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని బువ్వనపల్లిలో ఈరోజు జరిగిన ఆక్వా రైతుల ఆత్మీయ సమావేశంలో పేర్ని నాని పాల్గొని మాట్లాడారు.న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో ఆక్వా రైతాంగం తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్ని నాని మండిపడ్డారు. ఆక్వా మేత ధరలు ఆకాశాన్నంటుతున్నా వాటిని అదుపు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు. మేత కంపెనీల యాజమాన్యాలు, పాలకులు చేతులు కలపడం వల్లే పెట్టుబడి వ్యయం పెరిగిపోయి రైతులు భారీ నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆరోపించారు.ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు జులై 15వ తేదీన జగన్ భీమవరం రావడం ఖాయమైందని పేర్ని నాని వెల్లడించారు. ఈ పర్యటనను ఫ్లాప్ చేయడానికి లేదా అడ్డుకోవడానికి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా, కుతంత్రాలు చేసినా జగన్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదన్నారు."కూటమి ప్రభుత్వం హెలిప్యాడ్‌కు అనుమతులు నిరాకరిస్తే నిరాకరించుకోవచ్చు. జగన్ అవసరమైతే సామాన్యుడిలా రైల్లో ప్రయాణించి అయినా సరే ఇక్కడికి చేరుకుంటారు. రైతులను కలిసి వారి సమస్యలపై ప్రభుత్వం దిగివచ్చేలా పోరాడుతారు" అని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, లేదంటే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స

## ముంబైలో వైద్యుల సమక్షంలో ఆపరేషన్

## ప్రకటన విడుదల చేసిన డిప్యూటి సిఎం కార్యాలయం

**అమరావతి,జులై 11(ప్రజావినికిడి)::** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను ఆపరేషన్ అనంతరం రికవరీ గదికి తరలించారని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అనస్థీషియా ప్రభావం నుంచి బాగా కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స అందిస్తున్న వైద్య బృందం నిశిత పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం ఉన్నారని వెల్లడించారు. వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సలహా ఇచ్చారని అన్నారు. ముందుగా తన అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ముందే వాటిని పూర్తి చేయాలని నిర్ణయించారని చెప్పారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేయడంతో ఆపరేషన్ తర్వాత గణనీయమైన అసౌకర్యం, కదలిక పరిమితి ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో వైద్య బృందం మొదట కుడి భుజానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించిందని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తగినంత కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స చేయాలని ప్రణాళిక చేశారని అధికారులు తెలిపారు. ఆయన అవిశ్రాంత ప్రజా కార్యక్రమాలు, విస్తృత
రాజకీయ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో నిరంతర సంభాషణల కారణంగా, 2016లో అయిన ఈ భుజం గాయాలు సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమంగా తీవ్రమయ్యాయని వెల్లడించారు. నిరంతర నొప్పిని భరిస్తున్నప్పటికీ, ఉప ముఖ్యమంత్రి ఎలాంటి అంతరాయం లేకుండా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ కోలుకోవడానికి సంబంధించిన మరిన్ని వివరాలు తగిన సమయంలో తెలియజేస్తామని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

# డ్రగ్స్ మాఫియాపై ఈగిల్ ఉక్కుపాదం

## ఏడాది కాలంగా ఏడుటన్నుల గంజాయి స్వాధీనం



**హైదరాబాద్‌జులై 11(ప్రజావినికిడి):**
డ్రగ్స్ మాఫియాపై తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత ఏడాదిలో ఏకంగా ఏడు టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణను డ్రగ్స్ ట్రాన్సిట్ హబ్‌గా మార్చే ప్రయత్నాలకు చెక్ పెట్టారు. ఈగల్ అధికారులు, ఇంటెలిజెన్స్‌తో దేశవ్యాప్తంగా వరుసగా భారీగా డ్రగ్స్‌ను సీజ్ చేశారు. రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో 500 కేజీలు, తాజాగా 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల నిఘాతో డ్రగ్స్ రవాణా ముఠా ఆగడాలను ఆటకట్టించారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులో 385 కేజీల గంజాయిని ఈగల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏడు రోజుల పాటు నిఘా ఉంచి డ్రగ్స్ రవాణా ముఠాను ట్రాక్ చేశారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం ఫాలో అయ్యారు. కోల్‌కతా, ముంబై జాతీయ రహదారిపై గంజాయి వాహనాన్ని ఎన్సీబీ రాయ్‌పూర్ బృందం అడ్డుకుంది. మహారాష్ట్ర, రాజస్థాన్‌కు తరలిస్తున్న గంజాయిని గమ్యానికి చేరకముందే స్వాధీనం చేసుకున్నారు. కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్ట్ చేశారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ అధికారులు ఇచ్చిన ఖచ్చితమైన సమాచారంతో ఎన్సీబీ అధికారులు ఆపరేషన్ విజయవంతం చేశారు. రాష్ట్ర సరిహద్దులు దాటి డ్రగ్స్ మాఫియాపై ఈగల్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ వ్యతిరేక పోరులో కీలక శక్తిగా ఈగల్ అధికారులు మారారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో మరింత దూకుడుగా ఈగల్ అధికారులు చర్యలు చేపట్టారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈగల్ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# సాయికృష్ణ విచారణలో అడ్డంకిగా నిబంధనలు

### సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం



**అమరావతి, జులై 11:(ప్రజావినికిడి):** సాయికృష్ణ లాకప్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఐ నాగరాజు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన కఠిన నిబంధనలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న షరతును సిట్ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. నిరంతర వీడియో నిఘా వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రికన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టు కండీషన్లు అడ్డంకిగా మారాయని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేసింది. నిందితుడిని ఎటువంటి కఠిన షరతులు లేకుండా విచారించేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. కాగా, విజయవాడలో సంచలనం సృష్టించిన కస్టోడియల్ డెత్ కేసులో నిజాలు రాబట్టేందుకు సుప్రీంకోర్టు తీర్పు కీలకంగా మారింది. సిట్ వేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# గందరగోళంగా సర్ ప్రక్రియ !

**అమరావతి,జులై 11: (ప్రజావినికిడి):**
సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు.

మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే



గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం
ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

### మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత -అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్

**అమరావతి,జులై 11(ప్రజావినికిడి):**
హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ - 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు,




సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు.

'ఫార్చ్యూన్ ఇండియా' విడుదల చేసిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్' జాబితాలో నారా బ్రాహ్మణికి చోటు దక్కడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. బ్రాహ్మణి ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. ఇది ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపని కొనియాడారు. బ్రాహ్మణి సాధించిన ఈ ఘనత యువతులకు, ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణి మరిన్ని విజయాలు సాధిస్తూ, కొత్త మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన సందేశంలో తెలిపారు.

# ఆరుగురిని చంపి నరరూప రాక్షసుడు

### బాలికను బలవంతంగా కారులో తరలింపు

### సిసిటివీల్లో రికార్డు అయిన దృశ్యాలు

**రంగారెడ్డి, జులై 11:(ప్రజావినికిడి):**
పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మైనర్ బాలికను నిందితుడు రాజ్‌కుమార్ బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. దీనికి సంబంధించిన




సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్‌పై మే 16వ తేదీన పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక (17)ను వేధించాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 26వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే శుక్రవారం అతను జైలుపై విడుదలయ్యాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి, ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి లక్ష్మి, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుపడ్డారు. దీంతో వారిద్దరినీ కత్తితో పొడి చంపాడు. అనంతరం బాలికను దైవాలగూడ సమీపంలోని చెరువు దగ్గరకు తీసుకెళ్లి పీకకోసి హత్య చేశాడు. శనివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్.. కట్టుకున్న భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్(4), దైవీక్షిత్(2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి అందర్నీ చంపేశానని.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాజ్ కుమార్ చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అరుణ్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కాగా, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఆరు హత్యలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# ఓటిటి సినిమాలకు కూడా సెన్సార్ షిప్


### తాజా పరిణామాలతో కేంద్రం యోచన

**న్యూఢిల్లీ,జులై 11(ప్రజావినికిడి):**
భారతదేశంలో నెట్‌ప్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద





ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్
వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# పానీపూరీ రుచి చూసిన అశ్వినీ వైష్ణవ్



**హైదరాబాద్,జులై 11(ప్రజావినికిడి):** :హైదరాబాద్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పానీ పూరి రుచి చూశారు. హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలోని చాట్‌బండార్ వద్ద పానీ పూరి తిన్నారు. అనంతరం యూపీఐ ద్వారా రూ.175 అశ్వినీ వైష్ణవ్ చెల్లించారు.

# 100 మీటర్లు 10.14 సెకన్లలో.. తొలి భారతీయుడిగా అనిమేశ్ రికార్డు..!





భారత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో ఆశాకిరణంగా అవతరించిన అనిమేశ్ కుజుర్ (Animesh Kujur) మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇండియన్ ఉసేన్ బోల్ట్‌గా పేరొందిన ఈ కుర్రాడు విదేశీ గడ్డపై 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేశాడు. జర్మనీ వేదికగా జరిగిన పుమా ఫాస్ట్ ఆర్ఫ్ఫు లెగ్స్ 2026 మీట్‌లో సత్తా చాటిన అనిమేశ్ భారత్ అవతల ఇంత వేగంతో వంద మీటర్లు పరుగెత్తిన తొలి అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పాడు.ట్రాక్ మీద బుల్లెట్ వేగంతో దౌడు తీస్తూ జాతీయ స్థాయిలో రికార్డులు బద్ధలు కొడుతున్న అనిమేశ్ కుజుర్ మళ్లీ మెరిశాడు. టోక్యోలో జరుగబోయే వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిక్స్ మీద గురి పెట్టిన అతడు పుమా పాస్ట్ ఆర్ఫ్ఫు లెగ్స్ 2006 మీట్‌లో చిరుతలా పరుగుతీశాడు. 10.14 సెకన్లలోనే 100 మీటర్ల పరుగును పూర్తి చేసి ఔరా అనిపించాడు. తొలుత 10.19 సెకన్లకు పరిమితమైన అనిమేశ్ ఫైనల్లో తన వేగాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అయితే.. అత్యంత వేగంగా 100 మీటర్ల పరుగుతో రికార్డు సాధించిన గురిందెర్వీర్ సింగ్(10.09 సెకన్లు)ను మాత్రం అందుకోలేకపోయాడీ రన్నర్.

# క్రాంతికి మూడు వికెట్లు.. పోరాడుతున్న ఇంగ్లండ్ కెప్టెన్..!

లార్డ్స్ టెస్టులో భారత జట్టు పట్టుబిగిస్తోంది. తొలిరోజే ఆలౌటైన టీమిండియా.. రెండో రోజు ఇంగ్లండ్‌ను వణికించింది. మొదటి సెషన్‌లోనే పేసర్ క్రాంతి గౌడ్(3-25) వికెట్ల వేట కొనసాగించగా.. ఆతిథ్య జట్టు బెంబేలెత్తిపోయింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(1-36), స్నేహ్ రాణా(1-35) రెచ్చిపోగా సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(39 నాటౌట్) పోరాడుతోంది. లంచ్ సమయానికి ఇంగ్లండ్ 150 కూడా కొట్టలేకపోయింది.స్వదేశంలో చెలరేగాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లకు భారత పేసర్లు చుక్కలు చూపిస్తున్నారు. లార్డ్స్ టెస్టులో క్రాంతి గౌడ్(3-25) నిప్పులు చెరగడంతో తొలి రోజే ఓపెనర్ టమ్మీ బ్యూమంట్(2)ను కోల్పోయిన ఆతిథ్య జట్టు.. రెండో రోజు తొలి సెషన్‌లోనూ మరో రెండు వికెట్లు నష్టపోయింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది.



# మెస్సీకి 'పెనాల్టీ' షాక్ ఇస్తారా.. అర్జెంటీనా మేనేజర్ సమాధానమిదే..!



ఫిఫా వరల్డ్‌కప్‌లో నాకౌట్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు వేళైంది. కొలంబియాకు చెక్ పెట్టిన స్విట్జర్‌లాండ్‌ను లియోనల్ మెస్సీ సేన ఢీకొట్టనుంది. కీలకమైన మ్యాచ్ కావడంతో ఏ చిన్న పొరపాటు చేయొద్దని ఇరుజట్లు భావిస్తున్నాయి. అయితే.. ఫామ్‌లో ఉన్న మెస్సీ పెనాల్టీలను గోల్‌గా మలచలేకపోవడం డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను వేధిస్తోంది. ఈ నేపథ్యంలో స్విస్ మ్యాచ్‌కు ముందు అర్జెంటీనా మేనేజర్ లియోనల్ స్కలోని మీడియాతో మాట్లాడుతూ పెనాల్టీ అవకాశం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో ఆడుతున్న అర్జెంటీనాకు నాకౌట్‌లో సవాళ్లు ఎదురవుతున్నాయి. కార్బో వెర్డే, ఈజిప్ట్ చేతిలో అతికష్టమ్మీద గట్టెక్కిన మెస్సీ సేన.. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్‌లాండ్‌తో అమీతుమీకి సిద్ధమైంది. ఆదివారం ఉదయం 6 గంటలకు మ్యాచ్ ఉన్నందున మేనేజర్ లియోనల్ స్కలోని మీడియాతో మాట్లాడాడు. ఈ ఎడిషన్‌లో రెండు పెనాల్టీలను గోల్ పోస్ట్‌లోకి పంపని మెస్సీకి మరో అవకాశం ఇస్తారా లేదా అనే ప్రశ్నకు అతడు అవును అనిగానీ, కాదు అనిగానీ చెప్పలేదు.

# వింబుల్డన్‌కు క్రికెట్ కళ.. రాయల్ బాక్స్‌లో గిల్, సచిన్..!



ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న వింబుల్డన్ టోర్నీకి క్రికెట్ కళొచ్చింది. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ గ్యాలరీలో సచిన్ టెండూల్కర్, వెస్టిండీస్ లెజెండ్ బ్రియాన్ లారా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తళుక్కుమన్నారు. రాయల్ బాక్స్‌లో రాయల్ లుక్‌తో గిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా.. సతీమణి అంజలి సమేతంగా సచిన్ హాజరయ్యాడు. విరామంలో వీరితో టెన్నిస్ గ్రేట్ రోజర్ ఫెదరర్ కలవడంతో కెమెరా కళ్లన్నీ వీరివైపే తిరిగాయి.వన్డే సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ చేరుకున్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బిజీగా గడుపుతున్నాడు. పాప్ సింగర్లను కలిసి.. మెర్సిడెజ్ బెంజ్ గ్యారేజ్‌లో ఫార్ములా వన్ రేసర్ ఆంటినెల్లాతో కలిసి కారిడార్ క్రికెట్ ఆడిన గిల్ ఈసారి వింబుల్డన్‌లో మెరిశాడు. భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ సతీసమేతంగా మ్యాచ్ చూసేందుకు రాగా.. రాయల్ బాక్స్‌లో వారి పక్కనే కూర్చున్నాడు టీమిండియా కెప్టెన్. మ్యాచ్ చూసేందుకు వచ్చిన వెస్టిండీస్ వెటరన్ బ్రియాన్ లారా, టెన్నిస్ లెజెండ్ రోజర్ ఫెదరర్‌తో కాసేపు ముచ్చటించాడు గిల్. జకోవిచ్, సినర్ మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించారు వీరంతా.

# నేడు ఐదో టీ20.. సంజూ శాంసన్‌కు ఛాన్స్

హైదరాబాద్ : ఇంగ్లండ్‌తో ఐదో టీ20 మ్యాచ్ కోసం టీమిండియా సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే మూడు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన భారత్, కనీసం ఈ మ్యాచ్‌నైనా గెలిచి క్లీన్ స్వీప్ కాకుండా గౌరవాన్ని కాపాడుకోవాలని భావిస్తోంది. జోఫ్రా ఆర్చర్, సామ్ కరన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఫామ్‌లో లేని తిలక్ వర్మ స్థానంలో సంజూ శాంసన్‌కు అవకాశం ఇవ్వాలని అభిమానులు కోరుతున్నారు. బ్యాటింగ్ ఆర్డర్ దెబ్బతింటుందని హెడ్ కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. మరి ఛాన్స్ ఇస్తారా లేదా చూడాలి.




# స్మృతి మంధాన అరుదైన ఘనత



హైదరాబాద్: భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఏకైక మహిళల టెస్టు తొలి రోజున ఆమె తన కెరీర్‌లో 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. దీంతో భారత్ తరఫున 300 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన అతి పిన్న వయస్కురాలైన మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. 29 సంవత్సరాల 357 రోజుల వయస్సులో ఈ మైలురాయిని అందుకుంది.స్మృతి మంధాన అంతర్జాతీయ కెరీర్ 2013 ఏప్రిల్ 5న బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌తో ప్రారంభమైంది. అప్పటి నుంచి మూడు ఫార్మాట్లలోనూ నిలకడగా రాణిస్తూ భారత మహిళల క్రికెట్‌లో అత్యంత విజయవంతమైన బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటివరకు టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 4,538 పరుగులు, వన్డేల్లో 5,411 పరుగులు చేసింది. టెస్టు క్రికెట్‌లో తొమ్మిది మ్యాచ్‌ల్లో 718 పరుగులు నమోదు చేసిన ఆమె రెండు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలు సాధించింది. లార్డ్స్ టెస్టులో చేసిన పరుగులతో మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, శుభాంగి కులకర్ణిలను అధిగమించి భారత మహిళల తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా నిలిచింది.

**భారత్‌కు ఆధిక్యం.. ఇంగ్లాండ్‌కు తొలి షాక్ ...** మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ కెప్టెన్ నాట్ సైవర్-బ్రంట్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభంలోనే షఫాలీ వర్మ డకౌట్ అయినా, మంధాన బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకుంది. అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ అర్ధశతకాలతో రాణించడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు భారత బౌలర్లు శుభారంభం అందించారు. క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో టామీ బ్యూమాంట్ కేవలం రెండు పరుగులకే ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ ఒక వికెట్ నష్టానికి 21 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 264 పరుగుల వెనుకబడి ఉండటంతో రెండో రోజు ఆటపై ఆసక్తి నెలకొంది.

# చెన్నైలో బిగ్‌బాష్ లీగ్




## ఆరంభ మ్యాచ్‌కు చెపాక్ ఆతిథ్యం

## భారత్, ఆసీస్ ప్రధానుల సమక్షంలో ప్రకటన

మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా), భారత్, ఆస్ట్రేలియా ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాల్లో అతిపెద్ద అడుగు పడింది. ఇప్పటికే కబడ్డీ, క్రికెట్ లీగ్‌లలో ఎంపిక చేసిన మ్యాచ్‌లను ఆస్ట్రేలియాలో నిర్వహించే ఆలోచనలకు పదునెక్కుతుండగా.. తాజాగా బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్ ఆరంభ మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించనున్నారు. భారత ప్రధాని నరెంద్ర మోడి ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. సెంటర్ ఆఫ్ ఆస్ట్రేలియా-భారత్ రిలేషన్స్ సంస్థ దీనికి ఆర్థికంగా మద్దతు ఇవ్వనుంది. క్రికెట్ ఆస్ట్రేలియా సైతం నిదులు సమకూర్చనుంది. భారత ప్రధాన మోడి, ఆసీస్ ప్రధాని ఆల్బనీస్ సమక్షంలో క్రికెట్ ఆస్ట్రేలియా శుక్రవారం మెల్‌బోర్న్‌లో ఈ ప్రకటన చేసింది. భారత్ సైతం ఐపీఎల్ మ్యాచ్‌లను ఆస్ట్రేలియాలో నిర్వహించే ఆలోచన చేస్తుందని సీఏ ఆశాభావం వ్యక్తం చేసింది.డిసెంబర్ 12న చెన్నైలో ఆరంభ మ్యాచ్ :బిగ్‌బాష్ లీగ్ 2026-27 సీజన్ షెడ్యూల్‌ను ఇంకా ఖరారు చేయలేదు. కానీ భారత్‌లో ఆరంభ మ్యాచ్ ప్రకటన కోసం తొలి మ్యాచ్ తేదిని వెల్లడించారు. డిసెంబర్ 12న ఆరంభ మ్యాచ్ చెన్నైలోని చెపాక్ స్టేడియంలో జరుగనుంది. డిఫెండింగ్ చాంపియన్స్ పెర్త్ స్కార్చర్స్‌తో మెల్‌బోర్న్ రెనెగెడ్స్ తలపడుతుంది. డిసెంబర్ 6న షెఫల్డ్ షీల్డ్ దేశవాళీ టోర్నీ ముగియనుండగా.. ఈ రెండు జట్ల ఆటగాళ్లు నేరుగా చెన్నైకి చేరుకోనున్నారు. చెపాక్‌లో మెల్‌బోర్న్, పెర్త్ జట్ల ఆటగాళ్లు మ్యాచ్ ముంగిట నాలుగు రోజుల పాటు సాధన చేయనున్నారు. బిగ్‌బాష్ లీగ్ మిగతా మ్యాచ్‌లన్నీ ఆస్ట్రేలియాలో జరుగుతాయి. దీంతో ఈ రెండు జట్లకు రెండో మ్యాచ్‌కు కనీసం ఓ పది రోజుల విరామం లభించేలా షెడ్యూల్ రూపొందించనున్నారు. బిగ్‌బాష్ లీగ్‌ను ఐపీఎల్ తరహాలో ప్రయివేటీకరణ చేసేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా ఆలోచన చేస్తుండగా... మెల్‌బోర్న్, పెర్త్ జట్ల యాజమాన్యాలు (రాష్ట్ర క్రికెట్ సంఘాలు) క్రికెట్ విక్టోరియా, వెస్టర్న్ ఆస్ట్రేలియాలు అందుకు సుముఖంగా ఉన్న సంగతి తెలిసిందే. చెన్నైలో ఆడేందుకు పలు క్లబ్‌లు ఆసక్తి చూపించాయని.. ఆరంభ మ్యాచ్‌కు స్టేడియం అభిమానులతో నిండుతుందని సీఏ దీమా వ్యక్తం చేసింది. క్రికెట్ ఆస్ట్రేలియాతో జత కట్టి.. బిగ్‌బాష్ లీగ్ ఆరంభ మ్యాచ్‌కు ఆతిథ్యం అందించటం గౌరవంగా భావిస్తున్నామని తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టిఎన్‌సీఏ) ప్రెసిడెంట్ టిజె శ్రీనివాసరాజ్ అన్నారు.

# మురుగన్ నేపథ్యంలో చిత్రాలు

## తెలుగు, తమిళంలో కార్తికేయుడి నేపథ్యంలో సినిమాలు







దక్షిణాది సినీ పరిశ్రమలో దైవిక, పురాణ గాథల నేపథ్యానికి నయా క్రేజ్ మొదలైంది. ఒకప్పుడు పౌరాణిక కథలకు కేరాఫ్ అడ్రస్‌గా కోలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీలు మళ్లీ అదే బాట పట్టినట్లు తెలుస్తున్నాయి. ప్రస్తుతం తమిళ, తెలుగు సినీ రంగాలలో లార్డ్ మురుగన్ (సుబ్రమణ్య స్వామి) కాన్సెప్ట్ ఒకవైపు భారీ ట్రెండ్‌గా మారుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రముఖ దర్శకులు, అగ్ర హీరోలు మురుగన్ బ్యాక్‌డ్రాప్‌లో ప్రతిష్టాత్మక చిత్రాలను ప్రకటించడం సోషల్ మీడియా వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ట్రెండ్‌ను మొదటిగా కోలీవుడ్ హీరో శివకార్తికేయన్ ప్రారంభించాడు అని చెప్పవచ్చు. శివకార్తికేయన్ పుట్టినరోజు పురస్కరించుకుని విడుదలైన ఒక గ్లింప్స్ ఇటీవలే అందరి దృష్టిని ఆకర్షించింది. శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో లోకనాయకుడు కమల్ హాసన్ భారీ నిర్మాణంలో, శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'సేయోన్' అనే చిత్రం ఈ మురుగన్ సెంటిమెంట్‌కు పునాది వేసింది. తమిళ ప్రాచీన సంస్కృతి, సాహిత్యంలో కార్తికేయుడిని 'సేయోన్' అని పిలుస్తారు. ఈ చిత్ర గ్లింప్స్‌లో శివకార్తికేయన్ విరుమాండి స్వామి పూనకం వచ్చినట్లుగా, అత్యంత ఊరమాస్ లుక్‌లో పల్లెటూరి జాతర నేపథ్యంలో కనిపించి అభిమానులను అలరించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ యాక్షన్ డ్రామాను అక్టోబర్ లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. జూనియర్ ఎన్టీఆర్ మరియు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్ అనౌన్స్ అయింది. ఈ చిత్రానికి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ విస్తృతంగా ప్రచారంలో ఉంది. దీంతో ఈ ప్రాజెక్ట్ కూడా మురుగన్ జీవితంపై రాబోతుండడంతో టాలీవుడ్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఈ సినిమా ప్రకటన సమయంలో నిర్మాత నాగవంశీ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్ట్ తీవ్ర వివాదానికి దారితీసింది. మురుగన్ స్వామి 'ఉత్తరాదిన జన్మించాడు.. దక్షిణాదిన పూజించబడుతున్నాడు' అంటూ ఆయన పేర్కొన్న వ్యాఖ్యలపై తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తమిళులు తమ ప్రాచీన దేవుడైన 'తమిళ్ కడవుల్' (తమిళ దేవుడు) మురుగన్‌ను ఉత్తరాది మూలాలతో ముడిపెట్టడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్టీఆర్ సినిమాపై ఈ రకమైన రాజకీయ, ప్రాంతీయ దుమారం రేగుతున్న తరుణంలోనే, ధనుష్ మరియు వెట్రిమారన్ కాంబినేషన్‌లో 'తమిళ్ మురుగన్' ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ ఫస్ట్ లుక్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్‌లో ధనుష్ ఒక భారీ ఏనుగుపై గంభీరంగా కూర్చొని, చేతిలో మురుగన్ స్వామి యొక్క శక్తివంతమైన ఆయుధం 'వేల్' (ఈటె) పట్టుకుని, ఒక భారీ సైన్యం ముందు తమిళ ప్రజలకు, ఆ నేలకూ రక్షకుడిగా కనిపించారు. అయితే ఒకప్పుడు భక్తిరస చిత్రాలుగా వచ్చిన దేవుళ్ల కథలు, ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో భారీ బ్జడెట్ యాక్షన్ డ్రామాలుగా, అలాగే ప్రాంతీయ అస్తిత్వానికి ప్రతీకలుగా మారుతున్నాయి.

# అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

## లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున




తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మాములుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భాగ్యశ్రీ ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.

# ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.




# షూటింగ్ లో గాయపడ్డ రాశి ఖన్నా

బిజీ కథానాయిక రాశి ఖన్నా షూటింగ్ సెట్‌లో గాయపడ్డారు. ప్రస్తుతం టాలీవుడ్ కంటే తమిళ్, హిందీ ప్రాజెక్టులపైనే ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఈ బ్యూటీ.. బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రల్లో అనీస్ బజ్మీ తెరకెక్కిస్తున్న ఓ భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో రాశి ఖన్నాకు గాయాలయ్యాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. యాక్షన్ సీన్స్ చేస్తున్నప్పుడు దెబ్బలు తగిలినప్పటికీ, రాశి ఖన్నా ఎక్కడా బ్రేక్ తీసుకోలేదు. తన వల్ల షూటింగ్‌కు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో గాయంతోనే ఆ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఒక ఫీమేల్ యాక్టరై ఉండి కూడా డూప్ లేకుండా క్లిష్టమైన స్టంట్స్ చేయడం, గాయపడినా వెనకడుగు వేయకపోవడంతో ఆమె అంకితభావాన్ని చూసి నెటిజన్లు, అభిమానులు సెల్యూట్ చేస్తున్నారు.ఇక తెలుగు సినిమాల విషయానికి వస్తే.. రాశి ఖన్నా ఇటీవల నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. కమర్షియల్‌గా ఈ సినిమా నిరాశపరచడంతో పాటు, ఇందులో ఆమె పోషించిన క్యారెక్టర్‌కు కూడా పెద్దగా స్కోప్ లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ బాలీవుడ్ ప్రాజెక్టులపైనే ఉన్నాయి.






# 'తక్షకుడు' షూటింగ్ పూర్తి చేసిన ఆనంద్ దేవరకొండ..

ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'తక్షకుడు' సినిమా షూటింగ్ పూర్తైంది. ఈ విషయాన్ని ఆయన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించారు. నటుడిగా తనకు అత్యంత సంతృప్తినిచ్చిన చిత్రాల్లో ఇదొకటని చెప్పారు. 'మిడిల్ క్లాస్ మెలోడీస్' తర్వాత దర్శకుడు వినోద్ అనంతోజుతో మళ్లీ పని చేయడం ఆనందంగా ఉందన్నారు. కథను, నటుడిని విభిన్నంగా చూసే దర్శకుడు ఆయన అని ప్రశంసించారు. తెలుగు ఫోక్‌లోర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ అంధుడి పాత్రలో కనిపించనున్నారు. గ్రామస్థుల మరణాలకు కారణమైన వారిపై తన పెంపుడు కుక్కతో కలిసి ప్రతీకారం తీర్చుకునే వ్యక్తిగా నటిస్తున్నారు. ఈ పాత్ర తనకు సవాల్‌గా అనిపించిందని, అదే సమయంలో ఎంతో ఆసక్తికరంగా కూడా ఉందని తెలిపారు. లుక్ టెస్ట్ స్కెచ్‌లు, షూటింగ్ సమయంలో తీసిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు.సినిమాలో తనతో కలిసి నటించిన 'బెర్లిన్' అనే కుక్కతో మంచి అనుబంధం ఏర్పడిందని ఆనంద్ తెలిపారు. దర్శకుడు భావోద్వేగాలకు తగ్గట్టుగా సహజమైన యాక్షన్ చేయించారని వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన వచ్చిందని, త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యే 'తక్షకుడు' ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 24న రామాయణ ట్రైలర్ విడుదల




భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613